భయంతో ఏం జరుగుతుందోనని చూస్తున్నారు.

''అదీ.. నాన్నా! అక్కడున్న పరిస్థితిలో నాకు ఆ హెల్ప్ కరెక్ట్ అనిపించింది.. చేసేశాను. క్షమించండి!'' అంది మహతి. కూతురు భుజాలు పట్టుకొని ..

''ఇప్పుడు ఆ పెద్దాయన పరిస్థితి ఎలా ఉందమ్మా!?'' అంటూ ప్రేమగా అడిగాడు రాజారాం!

తండ్రి అలా అడిగేసరికి రిలాక్స్ అయ్యి..

''ఓకే నాన్నా! బాగున్నాడు. ఆ విషయం తెలిశాకే నేను ఇంటికొచ్చాను'' నవ్వుతూ చెప్పింది.

బాహుబలి యుద్ధమే జరుగుతుందనుకున్న ప్రమీల, వాసంతి.. అక్కడి సీన్ చూసి షాక్ అయ్యారు.

ప్రమీల కల్పించుకుని..

''బాగుంది! కన్నబిడ్డ కాపురం కన్నా.. తెలియని వాళ్ల ప్రాణాలు మీకు ముఖ్యమయ్యాయా?'' అంది.

''అల్లుణ్ని బతిమాలి.. సర్దుబాటు చేద్దాంలే! అంత మందిలో మన కూతురికే ఆయన్ని రక్షించాలన్న ఆలోచన వచ్చింది చూడు.. అదే మానవత్వం! మానవత్వం ఉన్న మనుషులు.. ఎవరు ఆపదలో ఉన్నా చూస్తూ ఉండరు. ఏం చేయడానికైనా సిద్ధపడతారు. అది వాళ్ల గుణం. దేవుడిచ్చిన వరం! అలాంటి వాళ్లను గౌరవించాలి. మహతి చేసిందీ అదే! ఒక నిండు ప్రాణాన్ని కాపాడింది. ఇది బాధపడే విషయం కాదే!'' అన్నాడు.

''పైసా పైసా పోగేసినవి.. ఎవరికో ధారాదత్తం చేసొచ్చింది. కానీ, మీరు ఒక్కమాట కూడా అనలేదు. పైగా 'సహాయం చేయాలంటే రక్త సంబంధం ఉండాలా? ఒకరికొకరు తెలిసిన వారైతేనే సాయం చేయాలా? మనిషికి మనిషి సహాయం చేసుకోకుండా బతకడం ఎందుకు?? దండగ!' అంటూ పెద్దపెద్ద మాటలు మాట్లాడింది!! అయినా మీరేంటి??.. ఉలకరు పలకరు? నా పాటికి నేను వాగుతూనే ఉన్నా.. మీ పాటికి మీరు తింటూనే ఉన్నారు'' అన్నది భర్తకు భోజనం వడ్డిస్తూ..

''ఆపుతావా నీగోల! అది చేసింది మంచిపనేగా? కాకపోతే మన డబ్బులు పోయాయి. పోతే పోనీలే.. అక్కడ ఒక మనిషి ప్రాణం! పైసలంటే మళ్లీ సంపాదించుకోవచ్చు. ప్రాణం పోతే తిరిగిరాదు. ఒకరి సహాయం పొందిన మనం.. ఇలా సహాయం తప్పంటూ రాద్ధాంతం చేయడం ధర్మం కాదే.. ముందు నువ్వు తిను'' అంటూ భార్య పళ్లెంలో భోజనం పెట్టి..

''గుర్తుందా.. మన మహతి పుట్టిన రోజు''..

ఆ మాట వినగానే ఆమె గుండెల్లో ప్రకంపనలు రేపిన సంఘటన తాలూకు నీడలు కళ్ల ముందు కదిలాయి.

* * *

ఇరవై ఏళ్ల క్రితం.. జూన్ నెల. అర్ధరాత్రి దాటిన తరువాత కుండపోతగా వర్షం..

ప్రమీలకు నొప్పులు మొదలయ్యాయి. ఆమె బాధతో పెట్టే అరుపులకు ఉలిక్కిపడి లేచింది రెండేళ్ల వాసంతి.

అప్పుడే వచ్చిన రాజారాం.. నొప్పులతో విలవిల్లాడుతున్న భార్యని, ఏడుస్తున్న కూతురిని ఆటోలో ఎక్కించుకుని హాస్పిటల్‌కి బయల్దేరాడు. ఇంటికి.. ప్రభుత్వ ఆసుపత్రికి చాలాదూరం. ఆటోను వేగంగా నడుపుతున్నాడు.

ప్రమీల సొమ్మసిల్లి పోతుంటే..

''వచ్చేశాం.. కాస్త ఓర్చుకో!'' అంటూ.. వెనక్కీ, ముందుకూ చూసుకుంటూ ఆటోని పోనిస్తున్నాడు.

వర్షం ఇంకా పెరిగింది.. రోడ్లన్నీ జలమయం. పైగా కరెంట్ లేదు. గాలివాన.. మెరుపులు!

అంతలో మళ్లోసారి వెనక్కి తిరిగి..

''ఇదిగో వచ్చేశాం..'' అని చెప్పి ముందుకు తిరిగేలోపు.. వర్షం నీళ్లతో నిండి ఉన్న మ్యాన్‌హోల్‌లో ఆటో ముందు చక్రం దిగబడి.. ఆటో బోల్తా కొట్టింది. ముగ్గురూ చెల్లాచెదురుగా పడ్డారు.

వాసంతి ఏడుపు.. ప్రమీల అరుపులు.. ఆ వర్షంలో కలిసిపోతున్నాయి. బిడ్డని, భార్యని రక్షిద్దామనుకొన్న రాజారాం.. కాలు విరిగి లేవలేకున్నాడు. పాక్కుంటూ వచ్చి కూతుర్ని అక్కున చేర్చుకున్నాడు. అర్ధరాత్రి కావడంతో రోడ్డుపైన వాహనాలు తిరగడం లేదు. ఒకటీ అరా కనిపించినా.. ఎవ్వరూ సాయానికి రావడం లేదు. అప్పటికే ప్రమీల స్పృహ కోల్పోయింది.

కొద్ది సేపయ్యాక ఒక కారొచ్చింది. ఒక వ్యక్తి దిగి వచ్చి.. ముగ్గురినీ హాస్పిటల్‌కు చేర్చాడు.

ప్రమీలకు ప్రసవమైంది. రాజారాం కాలికి ట్రీట్‌మెంట్ చేయించి.. చేతిలో పదివేల రూపాయల డబ్బులు పెట్టాడు! రాజారాం అతనికి చేతులెత్తి మొక్కి..

''దేవుడిలా వచ్చి కాపాడారు. ఎంతోమంది మా అవస్థలు చూశారు. కానీ, ఎవరిలోనూ చలనం లేదు. మేము మీకు తెలియకపోయినా కాపాడారు. మీరే మా దేవుడు. మీ రుణం ఎలా తీర్చుకోను. ఇప్పటికే చాలా చేశారు. ఈ డబ్బులు ఎందుకు?? వద్దు సార్..'' అన్నాడు.

''నాకు తోచిన సాయం చేశాను. సహాయం చేయడానికి ఒకరికొకరు తెలిసుండాలా?. రక్త సంబంధం కలిగుండాలా? మనుషులకు మనుషులే సహాయం చేసుకోకుంటే ఎలా? అలాంటప్పుడు ఈ సమాజమెందుకు? నువ్వెందుకు.. నేనెందుకు? ఈ సంఘంలో బతకడం దేనికి?'' అని చెప్పి ముందుకు కదిలాడు.

* * *

అన్నం కలుపుతూ జ్ఞాపకాల్లోనే ఉన్న భార్యను.. అన్నం నోట్లో పెట్టడం లేదంటూ తట్టాడు రాజారాం.

జ్ఞాపకాల్లోంచి బయటికి వచ్చి..

''తింటున్నా!'' అంది ప్రమీల.

* * *

వారం గడిచాక.. ఒకరోజు ఉదయం రాజారాం ఇంటి ముందు ఒక కారు వచ్చి ఆగింది. అప్పుడే బయటికి వెళ్తున్న రాజారాం.. దాన్ని చూసి ఆగిపోయాడు. ఆ కారులోంచి ఒక పెద్దాయన దిగాడు. రాజారాం దగ్గరికి వచ్చి..

''బాబూ.. ఇక్కడ మహతి?'' అనగానే..

''నా కూతురే! మీరూ..'' అంటూ.. అతణ్ని పరీక్షగా చూశాడు. ఆశ్చర్యం.. తాము ఇన్నేళ్లూ దైవంగా కొలుస్తున్న వ్యక్తే అతను.

''సార్!! మీరా? ఇక్కడ..??'' అంటూ అడిగాడు.

''నేను మీకు తెలుసా? వయసు పైబడింది కదా.. జ్ఞాపకశక్తి తగ్గింది. గుర్తు పట్టలేకపోతున్నా''..

''మేము బతికున్నామంటే మీ దయనే.. ఇరవై ఏళ్ల క్రితం వర్షంలో ఆటో యాక్సిడెంట్.. పురిటి నొప్పులు..'' అని రాజారాం అనగానే..

''హా.. రాజారాం, ప్రమీల'' అన్నాడు ఆ పెద్దాయన.

''రండి రండి..'' అంటూ, అతని చేయి పట్టుకుని.. ఇంటిలోపలికి తీసుకొచ్చాడు.

కూర్చోండని కుర్చీ చూపించాడు.

''ప్రమీలా.. గుర్తుపట్టావా! మహతి పుట్టిన రోజున మనల్ని కాపాడిన..'' అంటూ చెప్పగానే..

వెంటనే పెద్దాయన కాళ్లకు మొక్కింది ప్రమీల.

''ఏం తీసుకుంటారు బాబాయి గారూ! టిఫిన్, టీ'' అంటూ అడిగింది.

''అవేమీ వద్దమ్మా! అన్నీ కానిచ్చాను.. ఇంతకూ మహతి?'' అని పెద్దాయన అనగానే..

రాజారాం, ప్రమీల ఆశ్చర్యపోయారు.

మహతి ఈయనకు ఎలా తెలుసని.

''మహతీ.. ఇలారా!'' అని పిలిచింది ప్రమీల.

గదిలోంచి వచ్చిన మహతి.. పెద్దాయన్ని చూసి..

''తాతగారూ.. మీరా! మీరిక్కడ?? ఎలా ఉంది మీ హెల్త్?'' అంటూ దగ్గరికి వచ్చింది.

''బాగుంది తల్లీ! కొడుకులు పుడితే జీవితానికి కొదవ లేదనుకున్నా! నా బిడ్డలకు నేను పాతబడి పోయానని వదిలేశారు. ఆడపిల్లవైనా.. అందులో చిన్నపిల్లవైనా నీలో చేతులెత్తి మొక్కే సంస్కారం, మానవత్వం నిండుగా ఉన్నాయి! దేవుడి ఆట గొప్పది. నువ్వు పుట్టినప్పుడు నా చేత మీ అమ్మానాన్నలకు సాయం అందించాడు. ఇప్పుడు నాకు పునర్జన్మ ఇవ్వడానికి నిన్ను పంపించాడు'' అంటూ ఆనంద బాష్పాలు రాల్చాడు.

విషయం అర్థమై.. ప్రమీల, రాజారాం, వాసంతి ఒకరినొకరు చూసుకుని.. పూజగదిలోని దైవాన్ని చూశారు.

* * *

ఇంతలో వాసంతి ఫోన్ మోగింది. భర్త శశికాంత్.

''వాసంతీ.. ఈరోజు సాయంత్రమే వస్తున్నా! రెడీగా ఉండు'' అన్నాడు.

''ఎందుకు?'' అడిగింది

''అదేంటి డియర్..?''.

''మనీ ఇంకా రెడీ అవ్వలేదు. అయ్యాక చెప్తా! వచ్చి తీసుకెళ్లండి.. మనిషిని కాదు.. మనీని..!'' వ్యంగ్యంగా అంది వాసంతి.

''సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న మహతి హెల్పింగ్ వీడియో చూశాను. మనుషులు అలాగే ఉండరు.. మారతారు! ఛాన్స్ ఇవ్వండి మేడమ్!'' అంటూ బతిమిలాడాడు.

ముసిముసిగా నవ్వుకుని..

''చూద్దాంలే మిస్టర్!'' అన్నది వాసంతి. ■

## పట్ల యాదగిరి



'గిరిపట్ల' కలంపేరుతో సాహిత్యసేవ చేస్తున్నారు పట్ల యాదగిరి. ఈయన స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల. ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. డిగ్రీ చేసిన యాదగిరి.. ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. 8వ తరగతిలో ఉన్నప్పుడే రచనలో తొలి అడుగు వేశారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ప్రతి ఆదివారం ప్రసారమయ్యే 'బాలానందం' కార్యక్రమంలో ఈయన రాసిన పొట్టి కవితలు ప్రసారమయ్యాయి. ప్రస్తుతం తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గీత రచయితగానూ కొనసాగుతున్నారు. 'పుత్రుడు' సినిమా కోసం ఈయన రాసిన తొలి పాటను ఎస్పీ బాలసుబ్రమణ్యం ఆలపించారు. ఆ తర్వాత 'శ్రీరాముడింట శ్రీకృష్ణుడంట' చిత్రం కోసం రాసిన 'అడుగుతో అడుగే అడుగేసిందని', 'తొలి పరువం కురిసిందని' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. అప్పటినుంచి వీరి పాటల ప్రయాణం మరింత వేగంతో దూసుకెళ్తున్నది. కృష్ణం, వస్తా, 14డేస్ లవ్ సినిమాల్లో ఈయన రాసిన పాటలు.. రచయితకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక కథ విషయానికి వస్తే.. ఓ యథార్థ సంఘటన స్ఫూర్తితో 'ఒకరికొకరు' రాసినట్టు రచయిత చెబుతున్నారు.